# పిన్ని

**పి**న్ని రావటం కామాక్షి కింకా కళ్ళకు కట్టినట్లుగానే ఉంది. ఆవిణ్ని నాన్నే వెంటబెట్టుకొచ్చాడు. వాళ్ళు వచ్చిన అలికిడికే కామాక్షి నిద్ర లేచింది. నిద్ర కళ్ళతో పిన్నిని చూచింది. ఒక పెద్ద పెట్టె ముందు కూచుని, బలవంతాన ముందుకు వంగి, మెడలో మంగళసూత్రానికి కాబోలు తాళం గుత్తితో పెట్టె తెరుస్తున్నది. నిగనిగ లాడే పిన్ని, ఒత్తయిన పిన్ని జుట్టూ, తెల్లగా మెరిసే ఆమె చెక్కిలీ కామాక్షికి కనిపించాయి.

ఆ చూపులోనే కామాక్షి పిన్నిని మోహించింది. అది చంటిపిల్లలకు కూడా కలిగే మోహం.

"పిన్ని ఎప్పుడూ మనింటో ఉండిపోతే బాగుండును. ఎప్పుడూ పిన్నికేసి చూస్తూ ఉంటే బాగుండును" అనుకున్నది కామాక్షి ఎందుకో. పిన్ని మళ్ళీ వెళ్ళిపోతుందనీ, తన కప్పుడు దిగులుగా ఉంటుందనీ కామాక్షి కొక బెంగ అప్పుడే పట్టుకుంది. పిన్నిని ఏవేవో కష్టాలు చుట్టుముట్టుకున్నాయనీ ఆమె వాటితో కృశించిపోతోందనీ మరీ బెంగ పట్టుకుంది.

పుట్టి పెరిగాక కామాక్షి పిన్నిని చూడటం ఇదే ప్రథమం. కామాక్షి నాలుగేళ్ళ పిల్లప్పుడు పిన్ని వచ్చినట్టు అమ్మ చెప్పింది. కాని ఆ చూపు కామాక్షికి బొత్తిగా జ్ఞాపకం లేదు. కామాక్షికి చుట్టాలు - ప్రత్యేకించి అమ్మ వేపువారు చాలామంది వున్నారు. వాళ్ళంతా కామాక్షికి బాగా తెలిసిన మనుషులు. వాళ్లకేసి ఎవరూ - అంటే కామాక్షి - చాలాసేపు చూడనవసరం లేదు. వాళ్ళను చూస్తూంటే ఏవేవో విచిత్రమైన, అలవాటులేని ఆలోచనలు రావు. పిన్నిని ఎంత సేపైనా చూడవచ్చు. అమ్మ చెల్లెలేగా అనిపించదు - పిన్ని ఎట్లా మాట్లాడుతుందో, ఏమంటుందో, ఏం చేస్తూందో అని చూస్తూ ఉండ బుద్ధి అవుతుంది. అదీ పిన్నికీ మిగిలిన వాళ్ళకీ తేడా.

అకస్మాత్తుగా కామాక్షికి ఆనందంతో ఒళ్ళంతా వేడెక్కినట్లయింది; తను అచ్చగా పిన్ని పోలికే అని నాన్న ఎన్నోసార్లు అనటం కామాక్షికి జ్ఞాపకం వచ్చింది. లేచి మొహం కడుక్కోగానే తన మొహం అద్దంలో చూసుకుందామనుకున్నది కామాక్షి.

పిన్ని పెట్టె తెరచి ఏవో బట్టలు సర్దసాగింది. అమ్మకూ పిన్నికీ ఉన్న తేడా చూసి కామాక్షి ఆశ్చర్యపోయింది. పిన్ని బాగా బొద్దుగా ఉంది. పిన్ని కట్టుకున్న చీరె ఒకటే కాక

పెట్టెలో ఉన్న చీరెలన్నీ కూడా నాజూకుగా ఉన్నాయి; అమ్మకు అటువంటి చీరె ఒక్కటీ లేదు. అసలు అమ్మ ముత్తయిదల్లే ఉంది. పిన్ని చేతివేళ్ళకి ఉంగరాలు కూడా ఉన్నాయి; ఆవిడ చేతితో పని చేస్తూంటే వేళ్ళు కదిలినప్పుడల్లా అవి కూడా కదలటం చూస్తూంటే ఎంతో బాగుంటుంది.

"పిన్ని వచ్చింది చూశావుటే?" అన్నది అమ్మ, కామాక్షి నిద్ర లేచిందని కనిపెట్టి.

కామాక్షి తల ఊపింది.

"పలకరించవేం మొద్దూ?"

పిన్నిని గురించి కామాక్షి ఏమనుకుంటుందో అమ్మకి ఒక్క రవ్వయినా అంతు చిక్కలేదు.

"పొట్టి తిపాచీ ముండ! దానికి ఎవరి గొడవా పట్టదే!" అన్నది అమ్మ పిన్నితో.

పిన్ని మాట్లాడలేదు. ఒకసారి అమ్మకేసీ, ఒకసారి కామాక్షికేసి చూసి పెట్టె మూయసాగింది.

"రేపు పెళ్ళి అయితే కాపరం ఎట్లా చేస్తుందోగాని" అని అమ్మ మనసులో మాట పూర్తి చేసింది.

ఈసారి పిన్ని అమ్మకేసి చాలాసేపు చూసింది.

"పిన్నిది అచ్చంగా కాంచనమాల మొహం!" అనుకున్నది కామాక్షి. కొద్దిరోజుల క్రితం ఇంటిల్లిపాదీ వెళ్ళి "వందేమాతరం" సినిమా చూశారు.

"అందరూ ఎట్లా చేస్తున్నారో అదీ అట్లాగే చేస్తుంది. ఆడదై పుట్టినాక అనుభవించొద్దూ?" అన్నది పిన్ని.

పిన్నికేదో చెప్పరాని కష్టాలున్నాయనేది కామాక్షి రూఢి చేసుకున్నది.

పాపం, పిన్ని కెందుకు రావాలి కష్టాలు? కొంతమందికి కష్టాలు వస్తే బాగానే ఉంటుంది. వాళ్ళు చక్కగా ఎప్పుడూ వాటిని గురించి చెప్పుకుంటూ వుంటారు. పిన్ని అట్లా చెప్పుకోదు. కష్టాలు చెప్పుకొనేవాళ్ళను చూసి అందరూ, "అయ్యో, పాపం" అంటారు. అప్పుడు వాళ్ళకి బాగుంటుంది. పిన్నివంటి వాళ్ళని చూసి, "అయ్యో, పాపం" అని ఎవరూ అనరు. అట్లా అనిపించుకొనే మనిషి కాదు పిన్ని.

పిన్నిని గురించి ఈ విషయాలు కామాక్షి కెట్లా తెలుసునో ఊహించటం మనకి సాధ్యం కాదు. చిత్రమేమంటే కామాక్షి ఊహ అబద్ధం కాదు. చిన్న పిల్లలు పెద్దవాళ్ళను గురించి ఒక్కొక్కప్పుడు చిన్న విషయాలలో మోసపోయినా, ఒక్కొక్కప్పుడు పెద్దవాళ్ళకు సంబంధించిన పెద్ద పెద్ద విషయాలలో ఇట్టే నిజం తెలుసుకుంటారు.

## 2

కామాక్షికి పదకొండేళ్ళు నిండుతాయి. పెళ్ళి విషయం ఆలోచిస్తున్నారు. పధ్నాలుగేళ్ళు వెళ్ళేదాకా ఎందుకు చెయ్యటమని నాన్న. "మహాబాగా చెప్పారు లెండి. అది కాస్తా ఈడేరకముందే ఈ మూడు ముళ్ళూ వేయించండి. మీకు పుణ్యముంటుంది. అందరిచేతా మొహాన ఉమ్మేయించుకోవటము నా వల్ల కాదు. ఏ విడ్డూరమొచ్చినా ముందు మనింటోనే. రాట్నాలు పెట్టి చేతులుపడేట్టు దారం తీయించారు. ఏడాదిపాటు ఎక్కడ చూసినా ఏకులే నూలుపోగులే. ఏది అనుకున్నా అల్లరీ ఆగమూ అయితే గాని మీరు వదల్రు. ఎరగని విషయమా ఏమి"టని అమ్మ.

నాన్న ఒకటనుకున్నాడు. అమ్మ కోసం కక్కుర్తిపడి ఏదో ఒక సంబంధం అంటగట్టనూ వద్దు. మంచి సంబంధం వస్తే నియమం కోసం ఆగనూ వద్దు. అందుకని నాన్న సంబంధాలు చూస్తూనే ఉన్నాడు.

అమ్మ కాస్త తొందరపడినా నాన్న తనకు మంచి సంబంధం కాకపోతే చెయ్యడని కామాక్షికి తెలుసు. అదీకాక కామాక్షికి కళ్యాణం బొట్టు పెట్టుకుందామనీ, మహా ఉంది. పెద్దయి ఎద్దల్లే పల్లకీలో కూచుంటే ఏం బావుంటుందేమిటి?

ఇంతా చేసి కామాక్షికి సంబంధం సిద్ధంగానే ఉంది. నాన్న అన్నం తిని బయటికి వెళ్ళినాక అమ్మా పిన్నీ అన్నాలకు కూచున్నప్పుడు ఒకనాటి రాత్రి అమ్మ ఈ సంబంధం గురించి చెప్పింది.

"నిక్షేపంలాంటి సంబంధం. కుర్రవాడు ఎట్లా ఉంటాడనుకున్నావు? పండునాయనల్లే ఉంటాడు. పద్దెనిమిదేళ్ళు. అప్పుడే బియ్యే చదువుతున్నాడు. వచ్చే ఏటికల్లా బియ్యే పాసయిపోతాడు. కట్నం కోరుతార్లే. అయిదుగురన్న దమ్ములు. అయితే ఏం? పెద్ద ఆస్తి. లంకంత ఇల్లు" అని అమ్మ మహా ఉత్సాహంగా చెప్పుకు పోతోంది.

పిన్ని చాలాసేపు మాట్లాడలేదు. అంతా విని, "అక్కయ్యా, నా మాట విను. దానికి పెళ్ళి చెయ్యకు. దాని గొంతు కొయ్యకు" అన్నది. భయంతో మాట్లాడుతున్న దానల్లే.

అమ్మ నిర్ఘాంతపోయి "అదేమిటే? పెళ్ళి చెయ్యకుండా ఎట్లా?" అన్నది.

"ఏం, పెళ్ళి కాకపోతే? ఆడదానికి పెళ్ళి అయితీరాలని రాసిపెట్టుందా?"

"చాల్లే నవ్విపోతారు."

"ఆడదానికి పెళ్ళి కాకపోతే నవ్విపోతారు గాని పెళ్ళయితే ఏడిచిపోరు. ఛీ, ఆడబతుకు!"

కామాక్షి పిన్ని కేసి తెరిచిన నోరు మూయటం మరచిపోయి చూస్తున్నది. అమ్మ ఈ సంగతి కనిపెట్టి "అన్నం తినటం అయిపోతే లేచిపోరాదుటే?" అన్నది.

లేచిపోయేటప్పుడు పిన్ని తనకేసి చూసిన చూపు కామాక్షిని విచిత్రంగా కదలించింది. ఆ చూపుతో పిన్ని తనకేదో చెప్పినట్టే అయింది. అది తన కర్థమయినట్టు కూడా అయింది.

కామాక్షి చెయ్యి కడుక్కుని బయటి వరండాలోకి వచ్చింది. నాన్న మంచంమీద కూచుని నోట్లో వక్క నములుతూ ఒక్కొక్క ఆకే తువాలు మీద జాగ్రత్తగా శుభ్రం చేసి, తొడమలూ కొసలూ తుంచి, సున్నం నాజూకుగా రాచి ఈనెలు తీసి ఆకులు చీల్చి పక్కగా బొత్తిగా పెట్టుకుంటున్నాడు.

కామాక్షి ఆయన పక్కన కూచుని చీల్చిన ఆకులు చిలకలు చుట్టి వేళ్ళకు తగిలించుకోసాగింది.

"నాన్నా, పిన్ని వాళ్ళ ఊరినుంచి ఎందుకొచ్చిందీ? ఎప్పుడెళుతుందీ?" అన్నది కామాక్షి, ఏదో పనున్నదానల్లే.

"బహుశా ఇక్కడే వుంటుంది. ఏం?" అన్నాడు నాన్న.

"వాళ్ళింటికి పోదూ? వాళ్ళకిల్లులేదూ?"

"నీకిబ్బందిగా వుందా? మీ అమ్మ అన్నట్టు నీకు చుట్టాలంటే పడదా ఏమే?"

"అసలెందుకొచ్చింది నాన్నా?"

"ఎందుకా? దాని మొగుడు మంచివాడు కాడు"

"ఏం చేస్తాడు?"

"ఏం చేస్తాడా? కొడతాడు. ఎందుకమ్మా నీకవన్నీ నీ?"

"పిన్నిని కొడతాడా నాన్నా? గట్టిగా కొడతాడా?"

"ఏమిటి నీ ఉద్దేశం? చాలామంది పెళ్ళాలని కొడతారు."

"ఎందుకు కొడతారు నాన్నా?"

"కొడితే పెళ్ళాలు పడివుంటారు గనకా."

"మరి పిన్ని పడివుండలేదుగా? ఇంకా కొడతాడా?"

"మనింటికి వచ్చేసిందిగా? ఇంకెట్టా కొడతాడూ?"

"మళ్ళీ పోతే కొడతాడా?"

"మళ్ళీపోతే ఇంట్లోకి అడుగుపెట్టనివ్వడు."

"వాళ్ళిల్లేగా."

"వాళ్ళిల్లేమిటి అది దాని మొగుడిల్లు. బయటికి పొమ్మంటే వెళ్ళిపోక ఏం చేస్తుందీ?"

"నువ్వు వెళ్ళమంటే అమ్మపోతుందా నాన్నా? నువ్వు అమ్మని కొట్టవేం?"

నాన్న నవ్వాడు.

"నేను మంచివాణ్ణి. అందుకని అమ్మను కొట్టను."

"పిన్ని మొగుడు చాలా చెడ్డవాడా?"

"వాడూ మంచివాడే కొన్ని విషయాల్లో. బోలెడంత డబ్బుంది కనక కొన్ని వెధవ వేషాలు వేస్తాడు."

"ఏం వేషాలు వేస్తాడు నాన్నా?"

ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలో మానాలో నాన్న తేల్చుకోలేక పోయినాడు. చెప్పవలసిన సమాధానాలు చిన్న పిల్లలు వినేవికావు. పిల్లల ప్రశ్నలను నిరుత్సాహపరచటం ఆయనకిష్టం లేదు. నేడో రేపో పెళ్ళికాబోతున్న దగ్గర ఇంకా దాచేదేమిటి అనుకున్నాడాయన.

"ఏం వేషాలేస్తాడా? అడ్డమైన ముండలతోను పోతాడు. వాళ్ళను తెచ్చి ఇంట్లో కూడా పెడతాడు. తాగుతాడు, వెధవల్నందర్నీ దగ్గిరికి చేరుస్తాడు. వాళ్ళందరి ఎదుటా పిన్నిని నానా మాటలూ అంటాడు."

"పోనీ పిన్ని వేరుగా వుండరాదూ? మంచి మేడ కొనుక్కుని అందులో తను ఒకత్తే వుండరాదూ?"

ఈ ప్రశ్న నాన్నకేదో బాధ కలిగించింది. పిన్ని తమ ఇంటో వుండి తమ తిండి తినటం కామాక్షి కిష్టంలేదని ఆయనకు అనుమానం వేసింది.

"పిన్నికి డబ్బేదమ్మా? మేడ ఎట్లా కొంటుంది? అసలు అన్నం ఎవరు పెడతారు?"

"ఏం, నాన్నా? వాళ్ళకి చాలా డబ్బుందిటగా? అగ్ఘరారం వుందిటగా?"

"అదంతా పిన్ని మొగుడిది. వాడు పెడితేనేగాని పిన్నికి అన్నం కూడా లేదు. మనం పిన్నిని వెళ్ళగొట్టామనుకో, ఏమవుతుందో తెలుసా? వీధుల్లో అడుక్కోవలిసిందే. పిన్ని దావా వేస్తే కోర్టువాళ్ళు మనోవృత్తి ఇప్పిస్తారు. ఎంత ఇప్పిస్తారో తెలుసా? నెలకు ఏడెనిమిది రూపాయలిప్పిస్తారు! దాంతో ఎట్లా బతుకుతుందీ?"

నాన్న కామాక్షి చేతి చిలకలు తీసి నోట్లో వేసుకోసాగాడు.

కాస్సేపు ఏదో ఆలోచించుకుని కామాక్షి "నాన్నా!" అన్నది.

"ఏమిటమ్మా?"

"పిన్నల్లే చాలామంది ఇంట్లోనించి లేచిపోతారా?"

"ఎక్కడికి లేచిపోతారు? ఎవరు భరిస్తారు?"

"మరి పిన్ని లేచివచ్చిందేం?"

"భరించగలవాళ్ళు అట్లానే ఏడుస్తూ వుంటారు. భరించలేనివాళ్ళు పిన్నల్లే

లేచివస్తారు. మీ తాతయ్యా మీ పిన్నిని చాలా గారాబంగా పెంచాడు. అభిమానం జాస్తి. మాట పడదు. అప్పటికీ చాలా మాటలు పడ్డది, ఎంతకాలమని భరిస్తుంది?"

"అభిమానం వుండటం తప్పా నాన్నా?"

"తప్పు లేదమ్మా."

కామాక్షి మళ్ళీ ఆలోచించింది;

"నేను పిన్నలే వుంటానా, నాన్నా?" అన్నది.

నాన్న నవ్వాడు. ఏమీ అనలేదు. కామాక్షి ఆ ప్రశ్న మళ్ళీ వెయ్యలేదు.

## 3

అంతా అనుకున్నట్టుగానే జరిగింది. నాన్న అడగటం వ్యవధానంగా వాళ్ళు అంగీకరించారు. వాళ్ళు అడిగిన కట్నం ఇవ్వటానికీ, లాంఛనాలు జరపటానికీ నాన్న ఒప్పుకున్నాడు.

తరవాత పిల్లవాడు వచ్చాడు. పిల్లను చూశాడు. పిల్లకూడా పిల్లవాణ్ణి చూసింది.

"మావాడికి పిల్ల నచ్చింది. మనం కూర్చుని మాట అనుకోవటమే తరవాయి" అన్నాడు పిల్లవాడి తండ్రి.

నాన్న పంచాంగం చూసి తాంబూలాలిచ్చుకోవటానికి మంచిరోజు కూడా చూశాడు.

"ఇదేమిటండీ? దీనికి పెళ్ళి అక్కర్లేదుట, దాని ఉద్దేశమేమిటో కాస్త కనుక్కోండి!" అన్నది అమ్మ నాన్నతో.

"ఏమిటమ్మా? ఎందుకొద్దూ?" అన్నాడు నాన్న.

"నా కక్కర్లేదు నాన్నా! నేను పెళ్ళి చేసుకోను" అన్నది కామాక్షి మూర్ఖంగా.

"ఏం? ఆ అబ్బాయి బాగుండలా?"

"నాకసలు పెళ్ళి వొద్దు."

"ఎందుకొద్దే?"

"వొద్దు, నేను చేసుకోను."

నాన్నకేమీ తోచలేదు. నాన్నా అమ్మా ఒకళ్ళనొకళ్ళు చూసుకున్నారు.

"నిక్షేపమంటి సంబంధం" అన్నది అమ్మ.

"కాకపోతే చిక్కేలేదు. మంచి సంబంధం కాకపోతే నేనసలు తల పెడతానా?" అన్నాడు నాన్న.

"దాని మొహం లెండి. అసలు దాన్నడిగేదేమిటి? మీరే దాన్ని మొదటి నించీ నెత్తి కెక్కించుకున్నారు."

"కాకపోతేమాత్రం అది వొద్దో అంటుంటే ఎట్లా చేస్తాం?"

"అందుకని మానేస్తారా? అవతల పెద్దమనుషులతో గూడిన పని కదా, వాళ్ళకేం చెబుతారు?"

"అదే నాకూ తోచకుండా వుంది."

"వాళ్ళకేం చెప్పి సంబంధం మానేద్దామనా మీరు చేసే ఆలోచనా? బాగుంది!"

ఇద్దరూ మాట్లాడలేదు.

బయట ఎవరో వచ్చిన అలికిడయింది.

"ఎవరు వారు?" అన్నాడు నాన్న.

చెప్పులు బయట వొదిలేసి లోపలికి వచ్చాడు – పిన్ని మొగుడు.

"నువ్వటోయ్? రా, రా! కాముడూ, బాబాయికి కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళు తెచ్చియివ్వవే!"

చెంబుతో నీళ్ళు తెచ్చియిచ్చింది కామాక్షి. అది తీసుకుని ఆయన బయటికి వెళ్ళగానే "ఎవరు నాన్నా?" అని అడిగింది.

"పిన్ని మొగుడే" అన్నాడు నాన్న.

ఎందుకో కామాక్షికి కలగదగినంత అసహ్యం కలగలేదు ఆయన్ని చూస్తే.

నాన్నా ఆయనా కలిసి మాట్లాడుకున్నారు.

"నాతో కాపరం చెయ్యలేక లేచివచ్చింది. నేనేమీ తప్పుపట్టను. కాని దానికి లేచిరావటానికి ఖర్మమేమిటి? దాన్ని వచ్చి ఇంటోనే వుండమను. నా అంతట నేను మారలేను. ఆస్తి యావత్తూ దాని పేరే పెడతాను. అప్పుడుగాని దానికి నా మీద తగిన అధికారం రాదు. నా చేతిలో పెత్తనం ఉన్నంత వరకూ దాని బతుకూ, నా బతుకూ ఇంతే. నా అహంకారమంతా ముప్పాతిక మూడు వీసాలు దాన్ని చూసుకునే. ఆ సంగతి దాని కెన్నిసార్లో చెప్పాను. అర్థం చేసుకోదు, అది లేకుండా కొంపంతా చిన్నబోతున్నది. నువు కాస్త చెప్పి చూడు! ఇట్లా దానికీ సుఖం లేదు, నాకూ సుఖం లేదు" అన్నాడు పిన్ని మొగుడు.

నాన్న కామాక్షి పెళ్ళి గొడవే మరిచాడు.

పిన్ని కూడా వచ్చింది. కూర్చుని గంటలకు గంటలు మాట్లాడుకున్నారు.

పిన్ని మొగుణ్ని అడగవలసినవన్నీ అడిగింది. పిన్ని మొగుడికి కోపం రాలేదు. పైగా ఆయనకి సంతోషం కూడా కలిగినట్టుంది.

"ఇవన్నీ నా మీద పేరబెట్టుకోవలసిన అవసరం లేదు. ఎప్పటికప్పుడు నన్ను

నువ్వు కడిగెయ్యవచ్చు. నేను కాదనలేదు. ఈ రెండు నెలలూ నేనెంత బాధపడ్డానో తెలుసా?" అన్నాడు పిన్ని మొగుడు.

"పెళ్ళాం లేచిపోయిందంటారని అవమానం!"

"ఇంకోళ్ళనే వాటికి లక్ష్యపెట్టే మొహమేనా నాది? ఇన్నేళ్ళబట్టీ ఇదేనా గ్రహించావు?"

"నామీద అభిమానమే అయితే, అది ఉన్నట్టుగా ప్రవర్తించగూడదూ?"

"చూపించటం నాకు చేతకావటం లేదన్నమాట. అచ్చగా నా కోసమే నేను దిగులు పడటంలేదు. నీ కోసం గూడా నాకు దిగులుగానే ఉంది. అన్నయ్యతో అన్నాను. ఇక పెత్తనమంతా నీ నెత్తినే వేసుకో, నా పెత్తనం అఘోరించినట్టే వుంది."

రాత్రి భోజనాలయ్యాక కూడా అర్ధరాత్రి పన్నెండు గంటలదాకా మాటలు సాగాయి. ఆఖరుకు పిన్ని మొగుడి వెంట వెళ్ళిపోవటం ఖాయమయింది. కామాక్షి అందరితో పాటు కళ్ళలో వొత్తులేసుకు కూర్చుంది.

"మళ్ళీ కాముడి పెళ్ళికే రావటం" అంది పిన్ని.

"ఏం పెళ్ళో? ఆ తెంపి పెళ్ళి అక్కర్లేదంటోంది" అన్నది అమ్మ.

ఆవిడకి అకస్మాత్తుగా అనుమానం తట్టింది – కామాక్షి పెళ్ళి వొద్దనటానికీ పిన్నికీ ఏదో సంబంధం ఉందని.

"ఎందుకు వద్దంటుందే? దానికేమన్నా పిచ్చా ఏమిటి?" అన్నది పిన్ని.

"నాకేమన్నా పిచ్చా?" అని కామాక్షి తన్ను తాను మౌనంగా ప్రశ్నించుకుంది.

***మొదటి ముద్రణ: ఆంధ్రజ్యోతి మాసపత్రిక, నవంబర్ 1948***